సాక్షి
కాకినాడ

బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన భవనం నిర్మాణానికి సత్తి పూర్ణచంద్రారెడ్డి, పూజ దంపతులు (ఏలూరు) రూ.2,05,000 విరాళం అందించారు.



నిత్యాన్నదానానికి విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి రుద్రరాజు సతీష్ రాజు, సుధ దంపతులు మంగళవారం రూ.1,25,000 విరాళం అందజేశారు.

కడలిలోకి 3.43 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 3,43,069 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. డెల్టా కాలువలకు 13 వేల క్యూసెక్కులు వదిలారు. ఇందులో తూర్పు డెల్టాకు 4,600, మధ్య డెల్టాకు 2,400, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 9.25, భద్రాచలం వద్ద 26 అడుగులకు నీటిమట్టం చేరింది.

న్యూస్‌రీల్

డయల్ యువర్ కలెక్టర్‌కు 19 వినతులు

కాకినాడ సిటీ: ప్రజల సమస్యల్ని నేరుగా తెలుసుకునే డయల్ యువర్ కలెక్టర్‌కు మంగళవారం 19 మంది వారి సమస్యలను ఫోన్ ద్వారా తెలియజేశారు. మంగళవారం కలెక్టర్ కృతికా శుక్లా ఉదయం 10.30 నుంచి 11.30 వరకు డయల్ యువర్ కలెక్టర్ నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి 19 మంది సంక్షేమ పథకాల లబ్ధి, విద్య, ఉపాధి, భూ సర్వే, భూ సమస్యలపై 18004253077కు ఫోన్ చేసి వివరించారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ఈ సమస్యలను గడువులోగా పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సురక్షపై డీఎంహెచ్‌వో సమీక్ష



జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం ప్రారంభంపై సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో నరసింహనాయక్

కాకినాడ క్రైం: త్వరలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రారంభం కాబోతున్న జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం ప్రారంభంపై డిఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ నరసింగరావు సూచనల మేరకు ఈ నెల 15వ తేదీన వలంటీర్లు, ఏఎన్ఎంలు క్షేత్రస్థాయిలో కార్యక్రమ నిర్వహణ కోసం సర్వే చేస్తారన్నారు. 20వ తేదీన కరపత్రాలు పంచి ప్రజల్లో అవగాహన కల్పిస్తారన్నారు. ఈ నెల 30న స్పెషలిస్టు వైద్యులు నిర్దిష్ట ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్యసేవలు అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందికి సూచించారు.

14న జాబ్ మేళా

బాలాజీచెరువు: జిల్లా ఉపాధి కార్యాలయ ఆవరణలో గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. విష్ణు క్యారియర్స్ ప్రైవేటు లిమిటెడ్, డీ-మార్ట్, పేటీఎం సంస్థలలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, బయోడేటా జెరాక్స్ కాపీలతో జిల్లా ఉపాధి కార్యాలయానికి హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారి ఒక ప్రకటనలో కోరారు. విష్ణులో మెకానిక్స్, టెక్నికల్ హెల్పర్స్, డీసీ మెకానిక్స్ పోస్టులకు ఐటిఐ, డిప్లమో ఉత్తీర్ణులు అర్హులన్నారు. డీ-మార్ట్‌లో సేల్స్ అసిస్టెంట్ పోస్టులకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటిఐ, డిప్లమో, డిగ్రీ ఉండాలన్నారు. పేటిఎంలో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్‌కు ఇంటర్, డిగ్రీ ఉండాలన్నారు. ఇతర వివరాల కోసం 0884-2373270 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

క్రోంచెట్ పోంచోస్‌కు గిన్నిస్ రికార్డు

- అమ్మ, అమ్మమ్మ, కుమార్తెల ఘనత
- అతిపెద్ద ప్రదర్శనగా పురస్కారం



గిన్నిస్ వరల్డ్ రికార్డుతో త్రీ జనరేషన్ మహిళలు

కాకినాడ సిటీ: ఊలు దారాలతో మహిళలకు ఉపయోగపడే పోంచోస్ తయారీలో కాకినాడకు చెందిన త్రీ జనరేషన్ (ముగ్గురు) మహిళలు మొదటిసారి గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించారు. విశాఖపట్టణానికి చెందిన మహిళా మనోవికాస్ వ్యవస్థాపకురాలు మాధవి సూరిభట్ల నేతృత్వంలో 250 మంది గృహిణులు ఆరు నెలల వ్యవధిలో 2,719 క్రోచెట్ పోంచోస్ (మహిళలు ధరించే వస్త్రం)ను నూలుతో తయారు చేశారని, దీనికి గిన్నిస్ వరల్డ్ రికార్డు వచ్చిందని తయారీదారు డొంకా వీరసోమేశ్వరిదేవి మంగళవారం కాకినాడలో విలేకర్లకు తెలిపారు. ఈ వస్త్రాలను విశాఖపట్నం అక్కయపాలెంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో పెట్టగా గిన్నిస్ వరల్డ్ రికార్డు సంస్థ ప్రతినిధి స్వప్నిల్ డంగారికర్ పరిశీలించి లార్జెస్ట్ డిస్‌ప్లే ఆఫ్ క్రోంచెట్ పోంచోస్‌గా గిన్నిస్ రికార్డు సాధించినట్టు ధ్రువీకరణ పత్రాన్ని అందించారని ఆమె తెలిపారు. ఈ వస్త్రాలను కాకినాడ నుంచి తన తల్లి చొల్లంగి మహాలక్ష్మి, తన కుమార్తె కాకినాడ ఆశ్రమ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న డొంకా ప్రియాంశీ తయారు చేసినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో మహిళలకు వీటిని ఉచితంగా పంపిణీ చేస్తామని వీరసోమేశ్వరిదేవి వివరించారు.

చేపా.. చేపా.. ఇక ఎండాల్సిందే..



తయారైన ఎండు చేపల ప్యాకింగ్

- ఎండు చేపల తయారీలో ఆధునిక పద్ధతులు
- సోలార్ డ్రయ్యర్ల ద్వారా ఎండబెట్టే ప్రక్రియ
- వీటి వినియోగంపై మత్స్యకారులకు శిక్షణ
- వాతావరణ ఇబ్బందులకు చెక్
- ప్రభుత్వ సబ్సిడీ..రుణ సదుపాయం

పిఠాపురం: చేపల్ని ఎండబెట్టడానికి మునుపటి కష్టాలు పోయాయి. రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన డ్రయ్యర్లతో ఎంచక్కా ఎండతో పనిలేకుండా ఎండబెట్టుకోవచ్చు. ఎండు చేపల తయారీలో ఎన్నో ఇబ్బందులు. వాటిని ఊరబెట్టడం ఒక ఎత్తయితే ఆరబెట్టడం మరో ఎత్తు. పగలు ఎండినా రాత్రి వేళల్లో మంచు ఎక్కువగా ఉంటే ఎండిన చేపలు మళ్లీ మెత్తబడిపోతాయి. ఒక్కోసారి అకాల వర్షాలు పెద్ద ఆటంకంగా తయారవుతాయి. ముఖ్యంగా వర్షాకాలంలో ఎండ తక్కువగా ఉండడం వల్ల చేపలు ఎండడానికి ఎక్కువ రోజులు పడుతుంది. తీరా ఎండలో కాస్సేపు ఎండినా వర్షం పడిందంటే ఎండు చేపలను కాపాడుకోడానికి మత్స్యకారులు పరుగులు తీయాల్సిందే. ఇదంతా గతం..సాంప్రదాయ పద్ధతుల్లో కాకుండా ఎండు చేపల కోసం ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం సోలార్ డ్రయ్యర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటిపై మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నారు ఫుడ్ ప్రోసెసింగ్ అధికారులు.

ఒక్క రోజులోనే ఎండుతాయి

సాధారణంగా ఎండు చేపల తయారీ అంటే రోజుల తరబడి ఉంటుంది. చేపలను ఉప్పులో ఊరబెట్టి ఎండబెడిగే ఐదు రోజుల నుంచి వారం రోజులు పడుతుంది. అది కూడా ఎండలు బాగా ఉంటేనే సాధ్యమవుతుంది. వర్షాలు, మబ్బులు ఉన్న సమయంలో ఈ చేపల తయారీ నిలిచిపోతుంది. ఇలాంటి బాధలకు సోలార్ యంత్రం చెక్ పెడుతుంది. మబ్బులున్నా చిన్నపాటి ఎండ ఉన్నా ఎక్కువ వేడి ఉత్పత్తి అవ్వడం వల్ల 24 గంటల్లోనే చేపలు పూర్తిగా డ్రై అయిపోతాయి. దీంతో సమయం ఆదా అవ్వడంతో పాటు కూలీల ఖర్చు తగ్గుతుంది. డిమాండ్‌కు తగ్గట్టుగా రోజూ ఎండు చేపలు సరఫరా చేసే అవకాశం ఉంటుంది.

చిన్న జాగా చాలు

గతంలో ఎండు చేపలు ఆరబెట్టు కోవడానికి సముద్రపు ఒడ్డున పెద్దగా ఖాళీ స్థలు ఉండేవి. రాను రానూ సముద్ర కోత వల్ల ఖాళీ స్థలాలు లేకుండా పోయాయి. దీంతో మత్స్యకారులు ఎండు చేపల తయారీకి స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సోలార్ ఎండు చేపల తయారీ విధానంలో కలిసొచ్చింది. చిన్న జాగా ఉంటే చాలు 500 కేజీల వరకు ఎండు చేపలను తయారు చేసుకునే వీలు కలుగుతుంది.

ప్రత్యేక ప్యాకింగ్

ఇప్పటి వరకు ఎండు చేపలను తాటాకు బుట్టలలో ప్యాకింగ్ చేసే వారు. దీనివల్ల వర్షాల సమయంలో రవాణా చేసేటప్పుడు చేపలు తడిసి పాడైపోయేవి. మత్స్యకారులు నష్టాలను చవి చూసే వారు. ఇప్పుడు ఎండిన చేపల రంగు మారకుండా నాణ్యత కోల్పోకుండా ప్రత్యేకంగా ప్యాకింగ్‌చేసుకునే మిషన్లు కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటి ద్వారా ఆకర్షణీయమైన కవర్లలో ఎండు చేపలను ప్యాకింగ్ చేస్తున్నారు. కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నారు. దీనివల్ల అమ్మకాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఎగుమతులకు ఆస్కారం కలుగుతుంది.



సోలార డ్రయ్యర్లలో ఎండు చేపలు

ఏమిటీ సోలార్ డ్రయ్యర్

- సోలార్ డ్రయ్యర్ ద్వారా నాణ్యత కోల్పోకుండా తక్కువ సమయంలో చేపలను ఎండబెట్టుకోవచ్చు.
- ఎండిన చేపలను ఎక్కువ రోజులు నిల్వ ఉండే విధంగా ..నాణ్యత ప్రమాణాలు లోపించకుండా ప్యాకింగ్ చేసుకునే అవకాశం కూడా ఇందులో ఉంది.
- మత్స్యకారులు ఈ డ్రయ్యర్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు.
- కరెంటుతో పని లేకుండా చేపలను ఎండబెట్టుకోడానికి ఇవి ఉపయోగకరంగా ఉంటాయి.
- తక్కువ స్థలంలో ఎక్కువ చేపలను ఆరబెట్టుకోడానికి వీలు కలుగుతుంది.
- ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ అండ్ మైక్రో ఫుడ్ ప్రోసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ ద్వారా మత్స్యకారులకు 35 శాతం రాయితీ, 65 శాతం రుణ సదుపాయంపై వీటిని ప్రభుత్వం అందించనుంది.
- 80 కేజీల నుంచి 500 కేజీల చేపలు ఎండబెట్టుకుని ప్యాకింగ్ చేసుకునేలా మిషన్లు అందుబాటులోకి వచ్చాయి.

ఇబ్బందులు ఉండవు



ఎండు చేపల తయారీకి చాలా ఇబ్బందులు పడేవాళ్లం. పచ్చి చేపలు తెచ్చి ఉప్పులో ఊరబెట్టి నాలుగైదు రోజల తరువాత బయటకు తీసి ఆరబెట్టేవాళ్లం. కనీసం వారం రోజులైనా ఎండ కాస్తేనే అవి ఎండుతాయి. మధ్యలో వాన పడితే మళ్లీ అన్ని రోజులు ఎండబెట్టాల్సిందే. ఇలా చాలా సార్లు నష్టాల పాలయ్యేవాళ్లం. సోలార్ డ్రయ్యర్ల వల్ల పెద్దగా ఎండతో పని లేక పోగా తక్కువ స్థలంలో చేపలు ఎండబెట్టుకోవచ్చు. తద్వారా ఇబ్బందులు తొలగుతాయి. ఈ పద్ధతి బాగున్నట్టు కనిపించింది.

– కారే చిట్టమమ్మ, ఎండు చేపల వ్యాపారి, ఉప్పాడ, కొత్తపల్లి మండలం

150 యూనిట్లు ఏర్పాటు లక్ష్యం



ఎండు చేపలు ఆరోగ్యకర పద్ధతుల్లో తయారు చేయడానికి ఏపీ ఫుడ్ ప్రోసెసింగ్ సోలార్ డ్రయ్యర్ల వినియోగంపై మత్స్యకారులకు శిక్షణ ఇస్తోంది. 150 మత్స్యకార మహిళా సంఘాలతో 150 యూనిట్ల ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. సోలార్ డ్రయ్యర్ రూ. 2 లక్షలు, ప్యాకింగ్ మిషన్‌తో కలిపి అయితే రూ.5 లక్షలు వ్యయమవుతుంది. ప్రతి రెవెన్యూ డివిజనుకు ఒక రిసోర్సు పర్సన్‌ను నియమించాం. వీరు మత్స్యకారులకు సోలార్ డ్రయ్యర్ల వినియోగం, ప్యాకింగ్, వ్యాపార మెళకువలు చెప్పి సహకారం అందిస్తారు.

– మారుతి, ఏపీఫుడ్ ప్రోసెసింగ్ సొసైటీ జోనల్ మేనేజర్, కాకినాడ.



ఉప్పాడలో సోలార్ డ్రయ్యర్ల వినియోగంపై మత్స్యకార మహిళలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

పరిపాలనాదక్షుడు సీఎం జగన్



తేటగుంటలో మహిళలకు ఇంటిస్థలం పట్టాను పంపిణీ చేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనాదక్షుడు అని రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. మంగళవారం తుని మండలం తేటగుంటలో పర్యటించి 446 మంది లబ్ధిదారులకు ఆయన జగనన్న ఇళ్లపట్టాలను పంపిణీ చేశారు. రూ.2.10 కోట్లతో తేటగుంట-రాతులపూడి రోడ్డు ఆధునీకరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆత్మ చైర్మన్ చోద్రాజు రాంబాబు రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 31 లక్షలకు పైగా ఇళ్లు నిర్మిస్తున్నారన్నారు. దీనివల్ల కొత్తగా వేలాది గ్రామాలు ఏర్పడుతున్నాయన్నారు. పేదలకు పక్కా గృహాలు ఏర్పడుతున్నాయన్నారు. మహిళల పేరన రూ.లక్షలు విలువచేసే ఆస్తి సమకూరుతుందన్నారు. అర్హత ఉంటే ఎంతమందికైనా ఇళ్లు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అర్హతే ప్రామాణికంగా తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. లంచాలు ఇస్తేనే గత ప్రభుత్వంలో పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలు మంజూరు చేసేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూపాయి లంచం ఇవ్వాల్సిన అవసరంలేదన్నారు. ఎవరైనా లంచం అడిగినా, సంక్షేమ పథకాలు రాకుండ అడ్డుకున్నా తన దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నాలుగేళ్లలో తేటగుంట గ్రామానికి వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ద్వారా రూ.55 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. పెరిక కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ పురుషోత్తం గంగాభవానీ, ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, పార్టీ మండల కన్వీనర్ పోతల రమణ, జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, సర్పంచ్ అత్తి నాగరాజు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విజయవంతంగా పునఃపరిశీలన పూర్తి

కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ఓటర్ల జాబితా పునఃపరిశీలన పూర్తి చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం విజయవాడ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ కృతికా శుక్లా కలెక్టరేట్ నుంచి అధికారులతో కలసి పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. జిల్లాలో జనవరి 6, 2022 తేదీ నుంచి ఆగస్టు 9, 2023వ తేదీ వరకు మరణించిన, ఆచూకీ లభించని కేసులను పునఃపరిశీలించినట్టు ఎన్నికల సీఈవోకు కలెక్టర్ వివరించారు. నిర్దేశిత గడువులోపు నూరు శాతం ఈ ప్రక్రియను పూర్తి చేసినట్టు తెలిపారు. జిల్లాలో 1634 పోలింగ్ స్టేషన్ల పరిధిలో జరిగిన సర్వే వివరాలు, ఫారం 6, 7, 8లకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన అభ్యంతరాలను పరిష్కరించే నిమిత్తం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి వారం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. అనంతరం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ శుక్లా సమావేశం నిర్వహించారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా-2024 రూపకల్పనపై చేపట్టిన ఓటర్ల పునఃపరిశీలన, అభ్యంతరాల పరిష్కారం, నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు వంటి అంశాలపై వారితో చర్చించారు. కొత్త ఓటు నమోదుకు జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన వారు అర్హులని ఆమె వివరించారు. జిల్లాలో ఏజెంట్ల నియామకం పూర్తి చేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ సూచించారు. కాగా ఎస్ఈసీ ముఖేష్‌కుమార్ మీనా ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 ప్రక్రియ, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపు అభ్యంతరాల పరిష్కారం, ఓటర్ల పునఃపరిశీలన, పోలింగ్ కేంద్రాల మార్పు, ఎపిక్ కార్డుల జనరేషన్ తదితర అంశాలపై కలెక్టర్‌తో సమీక్షించారు. సమావేశంలో డీఆర్వో కె.శ్రీధర్ రెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.జగన్నాథం, వివిధ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వర రావు, సీహెచ్ రమేష్‌బాబు, కె.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణ హితంగా వినాయక వేడుకలు

అధికారులతో కలెక్టర్ చర్చ

కాకినాడ సిటీ: జిల్లా వ్యాప్తంగా ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు వినాయక చవితి ఉత్సాలను సజావుగా నిర్వహించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో ఎస్పీ ఎస్ సతీష్ కుమార్, రెవెన్యూ, పంచాయతీ, వైద్య ఆరోగ్యం, పొల్యూషన్, ఎలక్ట్రిసిటీ, మత్స్య, అగ్నిమాపక తదితర శాఖల జిల్లా అధికారులు, నగర గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు,మున్సిపల్, మండల, డివిజన్ స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు, విగ్రహ నిమజ్జనాల నిర్వహణ, పారిశుద్ధ్యం, ట్రాఫిక్, పోలీస్ బందోబస్తు వంటి అంశాలపై చర్చించారు. అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కృత్రిమ రసాయనిక రంగులు వాడని, మట్టితో చేసిన విగ్రహాలను పూజించి పర్యావరణ హితంగా జరుపుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఉత్సవ మండపాలను జన, వాహన సంచారాలకు ఆటంకం కలిగించని రీతిలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రమాదాలకు తావులేని రీతిలో భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా పాటించాలన్నారు. మండపాలకు రెవెన్యూ, విద్యుత్, పోలీస్, మున్సిపల్, పంచాయతీ శాఖల అనుమతి విధిగా తీసుకోవాలన్నారు. విగ్రహాల నిమజ్జనానికి అనువైన ప్రదేశాలను ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లు గుర్తించి అవసరమైన క్రేన్లు, లైటింగ్ ఇతర సదుపాయాలను కలిపించాలన్నారు. 9, 10, 11వ రోజుల్లో ఎక్కువ సంఖ్యలో నిమజ్జనాలు చేసేందుకు అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంతో వ్యవహరించాలన్నారు. ఊరేగింపుల మార్గాల్లోనూ, నిమజ్జన ప్రదేశాలలోను సీసీ కెమెరాలతో గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జన ప్రదేశాల వద్ద గజ ఈతగాళ్లను, బోట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్, డీఆర్వో కె శ్రీధర్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి జె నరసింహనాయక్, కాకినాడ ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ, డీపీవో ఆర్ విక్టర్, తదితర అధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు నేరాన్ని ప్రజలు విశ్వసిస్తున్నారు

ఎమ్మెల్యే పెండెం దొరబాబు



పిఠాపురం: ఎన్నో ఏళ్లగా నేరాల నుంచి తప్పించుకుంటున్న చంద్రబాబు జైలుకు వెళ్లడంతో వంగవీటి మోహన రంగా ఆత్మ శాంతిస్తుందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంత పెద్ద రాజకీయ నాయకుడైనా చట్టాలను చుట్టాలుగా చూడకూడదన్నారు. ప్రజల కోసమే పరితపించిపోయే నాయకుడినని చంద్రబాబు చెప్పుకుంటున్నారని కాని సామాన్యుడు ఎవరు కూడా ఆయన జైలుకెళ్లడంపై బాధ పడటం లేదన్నారు. ఎవరూ స్పందించడం లేదంటే ఆయన తప్పు చేసినట్లు ప్రజలు నమ్ముతున్నారని అర్థమవుతోందన్నారు. ఆయన సొంత పార్టీ తెలుగుదేశంలో సైతం కొందరు నాయకులు మాత్రమే మొక్కుబడిగా స్పందిస్తున్నారు తప్ప పెద్దగా ఎవరు ముందుకు రాకపోవడం చూస్తుంటేనే ఆయన ఎంత పెద్ద నేరగాడో అర్థమవుతుందన్నారు. కాపు రిజర్వేషన్ల కోసం కాపు నేత ముద్రగడ పద్మనాభం తన ఇంటి వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే పారా మిలటరీ బలగాలను వందల సంఖ్యలో పెట్టి ఆయనను ఆయన కుటుంబ సభ్యులను దూషిస్తూ ఈడ్చుకుని వెళ్లినప్పుడు చంద్రబాబుకు ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఇతర వ్యక్తుల మాట ఎలా ఉన్నా సొంత మామ ఎన్టీఆర్‌ను మోసం చేసి పదవిని లాక్కుని ఆయన మానసిక ఆందోళనతో మృత్యువాత పడేలా చేసినప్పుడు మానవత్వం గుర్తుకు రాలేదు గాని ఇప్పుడు జైలుకు వెళ్లడంతో చంద్రబాబుకు అన్ని గుర్తుకు వస్తున్నాయన్నారు. ఆయన హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని చేసిన నేరాలకు ఘోరాలకు, ఆయన వల్ల ఇబ్బందిపడిన వారి బాద ఇప్పుడు చంద్రబాబు అనుభవించకతప్పదన్నారు.

మీ చిట్టి చేతులతో మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం! జిల్లా స్పాన్సర్‌గా శ్రీ షిర్డి సాయి విద్యా సంస్థలు వ్యవహరిస్తున్నారు.

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

District sponsor

SRI SHIRDI SAI
GROUP OF EDUCATIONAL INSTITUTIONS
RAJAHMUNDRY KADIYAM
website : www.sssjc.in

శిబిరం చిరునామా :
శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్
సురేష్‌నగర్, కాకినాడ

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 9010224454

క్లుప్తంగా

బ్యాడ్మింటన్‌లో సత్తా చాటిన దుర్గ ఈషా



ప్రకాశం నగర్ : ఆల్ ఇండియా బాడ్మింటన్ అండర్ 19 చాంపియన్ షిప్‌లో రాజమహేంద్రవరానికి చెందిన కంద్రపు దుర్గ ఈషా కాంస్య పతకం సాధించింది. బెంగళూరులో జరిగిన ఆల్ ఇండియా అండర్ 19 బాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి దుర్గ ఈషా ప్రాతినిధ్యం వహించింది. ఇటీవల కోయంబత్తూర్‌లో జరిగిన అండర్ 19 బాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో సిల్వర్ మెడల్ సాధించి అండర్ 19 విభాగంలో నేషనల్ చాంపియన్ షిప్‌నకు అర్హత సాధించిందని జిల్లా బాడ్మింటన్ జనరల్ సెక్రటరీ కొత్తపల్లి బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.

విద్యుత్ ప్యానల్ బోర్డు జారి పడిన ఇద్దరికి తీవ్ర గాయాలు

అన్నవరం: సత్యగిరిపై నిర్మాణంలో ఉన్న 138 గదుల శివసదన్ సత్రంలో విద్యుత్ సరఫరాకు ఎలక్ట్రికల్ ప్యానల్ బోర్డును లారీ నుంచి క్రేన్ సహకారంతో కిందకు దించుతుండగా అది జారిపడిన సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని హుటాహుటిన కాకినాడలోని ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయిస్తున్నారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపినట్టు అధికారులు తెలిపారు. దేవస్థానం అధికారులు మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం శివసదన్ సత్రంలోని 138 గదులకు విద్యుత్ సరఫరా పనులు పది రోజులుగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో లారీలో ప్యానల్ బోర్డు ను శివసదన్ సత్రానికి తీసుకువచ్చారు. సుమారు రెండు టన్నుల బరువు గల దానిని లారీ నుంచి క్రేన్ సహాయంతో దించుతుండగా అది జారిపోయింది. ఆ సమయంలో అక్కడ ఉన్న క్రేన్ సహాయ ఆపరేటర్ హఫీజ్, ఔట్‌సోర్సింగ్ ఫిట్టర్ సుబ్రాంజీకి తీవ్ర గాయాలయ్యాయి. దాంతో దేవస్థానం ఎలక్ట్రికల్ డీఈ సూర్యనారాయణ, ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ హుటాహుటిన కాకినాడలోని ప్రయివేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. వారికి ప్రాణాపాయం లేదని వారు తెలిపారు. కాగా, ఆ ప్యానల్ బోర్డు కూడా నుజ్జు నుజ్జు అయింది. సుమారు రూ. పది లక్షల వరకు నష్టం ఉంటుందని కాంట్రాక్టర్ తెలిపారు.

తుప్పల్లో మృతదేహం

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కెనాల్ కాలువ వంతెన కింద తుప్పల్లో మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. దాదాపు 15 రోజులు ముందుగా ఈ మృతదేహం కాలువలో కొట్టుకుంటూ వచ్చినట్లు భావిస్తున్నారు.. తుప్పల్లో ఉండటం వల్ల ఇంతవరకు ఎవరికీ కనిపించలేదు. ఈ మృతదేహం గుర్తు పట్టలేని విధంగా ఉందని స్థానికులు తెలిపారు.

సత్యగిరిపై స్మార్త ఆగమ విద్యా సౌరభం

- ఇక్కడ విద్యనభ్యసించిన ఆరుగురికి పరిచారక ఉద్యోగాలు
- స్టైపెండ్ నెలకు రూ.వేయి నుంచి రూ.మూడు వేలకు పెంపు
- దేవస్థానం ధర్మకర్తల మండలి తీర్మానాలు
- గురుకులాల మోడల్‌లో ఆగమ పాఠశాల
- ప్రస్తుతం 34 మంది విద్యార్థులు



సత్యదేవ స్మార్త ఆగమ పాఠశాల భవనాల సముదాయం



చదువు చెబుతున్న ఉపాధ్యాయుడు నర్సింహమూర్తి, పర్యవేక్షణ చేస్తున్న వేద పండితుడు ముష్టి పురుషోత్తం

అన్నవరం: శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని సత్యగిరిపై నిర్వహిస్తున్న శ్రీసత్యదేవ స్మార్త ఆగమ పాఠశాలలో విద్యార్థులకు దేవస్థానం ధర్మకర్తల మండలి శుభవార్త తెలిపింది. ఇక్కడ విద్య పూర్తి చేసుకున్న ఆరుగురు విద్యార్థులను దేవస్థానంలో 'సంభావన పురోహితులు'గా నియమించేందుకు తీర్మానం చేసింది. ఇక్కడ విద్యార్థులకు నెలనెలా చెల్లిస్తున్న ఉపకార వేతనం రూ.వేయి నుంచి రూ.మూడు వేలకు పెంచుతూ తీర్మానించారు. దీంతో ఇక్కడ స్మార్త, ఆగమ విద్యనభ్యసిస్తున్న 34 మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారు. అన్నవరం దేవస్థానంలో సోమవారం ధర్మకర్తల మండలి చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఈ మేరకు ప్రతిపాదన ప్రవేశపెట్టగా ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్, సభ్యులు ఈ తీర్మానాలను ఆమోదించారు.

నెరవేరిన మంత్రి హామీ

రూ.ఐదు కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీసత్యదేవ, స్మార్త, ఆగమ పాఠశాలను గత ఏడాది ఆగస్టు 13వ తేదీన డిప్యూటీ సీఎం, దేవదాయ, ధర్మాదాయశాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు. ఆ సందర్భంగా మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ ఇక్కడ విద్యనభ్యసించిన విద్యార్థులకు ఇక్కడే ఉపాధి చూపిస్తామని ఈ దేవస్థానంతో బాటు ఇతర దేవస్థానాలలోపరిచారకులు, అర్చకులు, పురోహితులుగా నియమిస్తామని తెలిపారు. ఏడాది తిరక్కుండానే ఆ హామీ నెరవేరింది. దీంతో ఆ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

12 సంవత్సరాల నుంచి రత్నగిరిపై ఆగమ పాఠశాల నిర్వహణ

అన్నవరం దేవస్థానంలో 12 సంవత్సరాల క్రితమే శ్రీసత్యదేవ స్మార్త ఆగమ పాఠశాలను స్థాపించి విద్యార్థులను స్మార్త, ఆగమ పండితులుగా తీర్చిదిద్దుతున్నారు. ఐదేళ్ల బ్యాచ్‌కు 12 మంది చొప్పున ఇప్పటి వరకు సుమారు నాలుగు బ్యాచ్‌లలో 35 మంది విద్యార్థులకు ఉచితంగా స్మార్త, ఆగమ విద్య బోధించారు. ప్రస్తుతం నూతన స్మార్త, ఆగమ పాఠశాలలో 34 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి ప్రతి నెలా రూ.వేయి స్కాలర్‌షిప్పును వారి పేరున బ్యాంకులో జమ చేస్తూ వస్తున్నారు. ఆ మొత్తం ఇప్పుడు రూ.మూడు వేలకు పెంచారు. విద్య పూర్తయ్యాక సర్టిఫికెట్‌తో బాటు ఐదేళ్ల స్కాలర్‌షిప్పు మొత్తాన్ని వడ్డీతో అందజేయనున్నట్టు ఈఓ అజాద్ తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా చదువు... ఆహారం..క్రీడలు

పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా వివిధ వైదిక కార్యక్రమాలకు సంబంధించిన విద్య బోధించడం, పౌష్టిక ఆహారం అందించడం, సాయంత్రం వ్యాయామం కోసం క్రీడలు నిర్వహిస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆరాధ్యుల లక్ష్మీనృశింహం తెలిపారు. ప్రతీ రోజు ఒక వేద పండితుడు ఇక్కడ విద్యార్థులకు స్మార్త, ఆగమ పాఠ్యాంశాలపై సందేహాలు నివృత్తి చేస్తున్నారని తెలిపారు. దేవాలయాలలో జరిగే వైదిక కార్యక్రమాలు, ఇతర పండగలు, ఉత్సవాలు, కార్యక్రమాల్లో పూజలు, అర్చనల్లో కూడా విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలోనే తొలిసారిగా గురుకులం మోడల్‌లో పాఠశాల నిర్మాణం

స్మార్త, ఆగమ, వైదిక పండితులను తయారు చేసేందుకు సత్యగిరిపై శ్రీ సత్యదేవ స్మార్త, ఆగమ పాఠశాలను నిర్మించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా రూ. ఐదు కోట్ల వ్యయంతో ఐదు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. టైల్స్ వంటి ఇటుకలతో గోడలు నిర్మించి పెంకుతో పై కప్పు ఏర్పాటు చేశారు. వేడి రాకుండా మధ్యలో మళ్లీ ఆ ఇటుకలతోనే అటకల మాదిరి ఏర్పాటు చేశారు. వెలుపల నుంచి చూస్తే ఓ అందమైన రిసార్టులా ఇది దర్శనమిస్తుంది. వాస్తవానికి 2017 లోనే ఈ భవనాలకు రూపకల్పన చేసినా 2019 వరకు పనులు నత్తనడకన సాగాయి. 2019 నుంచి పనులు వేగవంతమై 2022 మే నెలాఖరు కల్లా పూర్తయ్యాయి. మొత్తం పది భవనాలు నిర్మించారు. ఇక్కడే గురువులకు నివాస భవనం, విద్యార్థులకు వసతి భవనం, యాగశాల, మంచి నీటి సౌకర్యం, విశాలమైన రోడ్లు నిర్మించారు. ఒకసారి పాఠశాలలో అడుగుపెట్టిన విద్యార్థి చదువు పూర్తయ్యాక మాత్రమే బయటకు వెళ్లేలా అన్ని ఏర్పాట్లు చేశారు.

బ్లేడులతో బెదిరించి చోరీకి పాల్పడిన ముగ్గురి అరెస్టు



బ్లేడులతో బెదిరించి చోరీకి పాల్పడిన యువకులను అరెస్టు చేసిన పోలీసులు

జగ్గంపేట: జాతీయ రహదారిపై మోటారు సైకిల్‌పై వెళుతున్న ముగ్గురు యువకులను అడ్డగించి బ్లేడులతో బెదిరించి చోరీకి పాల్పడిన ముగ్గురిని మంగళవారం అరెస్టు చేసినట్లు జగ్గంపేట ఇన్‌చార్జి ఎస్సై గణేష్‌కుమార్ తెలిపారు. జగ్గంపేట మండలం రామవరం వద్ద జాతీయ రహదారిపై మోటారు సైకిల్‌పై జగ్గంపేటకు చెందిన కుర్ర బాలస్వామి అతని మిత్రులు వస్తుండగా వారిని బ్లేడులతో బెదిరించి మూడు సెల్‌ఫోన్లు, రూ2వేలు నగదు ముగ్గురు యువకులు దోపిడీ చేశారు. ఈ సంఘటన 4వ తేదీన జరగగా, ఈ నెల 9వ తేదీన కుర్ర బాలస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా మంగళవారం జగ్గంపేట ఇన్‌చార్జి ఎస్సై గణేష్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ శివార్లలో అనుమానాస్పదంగా కనిపించిన ధవళేశ్వరం గ్రామానికి చెందిన చిక్కాల కృష్ణ, పట్నాల సాయిబాబు, లంకెలపిల్లి విజయ్‌బాబును అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రామవరం వద్ద చోరీకి గురిఅయిన మూడు సెల్‌ఫోన్లు, నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ యువకులు ఆకతాయిగా తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్నారని పోలీసులు తెలిపారు.

మర్యాదతో మరింత ఆదరణ

- డ్రైవర్లు, కండక్టర్లకు నిపుణులతో కౌన్సెలింగ్
- వారంలో ఒక రోజు జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో నిర్వహణ
- ఫిర్యాదుల నేపథ్యంలో ఆర్టీసీ ఉన్నతాధికారుల చర్యలు



కండక్టర్లు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డిప్యూటీ సీటీఎం అప్పలనాయుడు

సాక్షి, విశాఖపట్నం: ప్రయాణికుల పట్ల సిబ్బంది మర్యాదగా వ్యవహరించడంపై ఆర్టీసీ అధికారులు ఫోకస్ పెడుతున్నారు. పాసింజర్ల మన్ననలు పొందడానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకోసం ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి పట్ల కొంతమంది డ్రైవర్లు, కండక్టర్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఏకవచనంతో సంభోదిస్తున్నారని, బస్సులు సక్రమంగా ఆపడం లేదని, దురుసుగా సమాధానం చెబుతున్నారని.. ఇలా పలు ఫిర్యాదులు ఆర్టీసీ కంప్లయింట్ సెల్‌కు అందుతున్నాయి. ఈ ఫిర్యాదులను ఆర్టీసీ యాజమాన్యం సీరియస్‌గా తీసుకుంది. ఇకపై కండక్టర్లు, డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదగా మెలిగేలా చర్యలు చేపట్టింది. ఇందుకోసం కంప్లెంట్ సెల్‌కు అందిన ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత కండక్టర్లు, డ్రైవర్లకు ప్రతి మంగళవారం కౌన్సెలింగ్ ఇవ్వాలని నిర్ణయించింది. ఆర్టీసీ జోన్–1కు సంబంధించి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఈ కండక్టర్లు, డ్రైవర్లకు విజయనగరం జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఈ ప్రక్రియకు మంగళవారం నుంచే శ్రీకారం చుట్టారు. ఉదయం రెండు గంటలు, మధ్యాహ్నం రెండు గంటల చొప్పున ఆర్టీసీలో ఎంపిక చేసిన అధికారులతో పాటు బయట నుంచి నిపుణులు, లెక్చరర్లు, అడ్వకేట్లను కూడా రప్పించి వారితో సుహృద్భావ వాతావరణంలో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా మెలగాలని, వారు అడిగిన ప్రశ్నలు, సందేహాలకు దురుసుగా కాకుండా సామరస్యంగా సమాధానం చెప్పాలని, చిరాకు ప్రదర్శించకుండా మాట తీరు గౌరవప్రదంగా ఉండాలని, వారిని ఏకవచనంతో సంభోదించవద్దని, ప్రయాణికుల మన్ననలు పొందాలని సూచిస్తున్నారు. ఈ కౌన్సెలింగ్ ద్వారా వీరి ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్ల వ్యవహారశైలి ప్రయాణికులపై ప్రభావం చూపుతుందన్న భావనకు అధికార్లు వచ్చారు. కౌన్సెలింగ్ ద్వారా వీరు ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మెలిగితే ఆర్టీసీపై ప్రయాణికుల ఆదరణ మరింత పెరుగుతుందని, ప్రైవేటు ఆపరేటర్ల వైపు మళ్లే అవకాశం ఉండదని వీరు భావిస్తున్నారు.

నిరంతరం కొనసాగిస్తాం



ప్రయాణికులతో కండక్టర్లు, డ్రైవర్లు మర్యాదగా వ్యవహరించడం వల్ల ఆర్టీసీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతుంది. దీంతో ప్రయాణికుల ఆక్యుపెన్సీ రేషియో పెరిగి ఆర్టీసీ ఆదాయం వృద్ధి చెందడానికి కూడా దోహదపడుతుంది. కంప్లయింట్ సెల్‌కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత సిబ్బందికి బ్యాచ్‌కు 10–15 మంది చొప్పున ఎంపిక చేసి నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. దీనిని నిరంతరం కొనసాగిస్తాం.

– సి.రవికుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జోన్–1

బర్త్‌డే కేకు తెచ్చేందుకు వెళుతూ యువకుడి మృతి

మరొక యువకుడికి తీవ్ర గాయాలు



మణికంఠ (ఫైల్)

తాళ్లరేవు: స్నేహితుడు పుట్టినరోజుకి కేకు తెచ్చేందుకు వెళుతూ ప్రమాదానికి గురై చవల మణికంఠ(23) అనే యువకుడు మృతి చెందగా, మరొక యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. మృతుని కుటుంబ సభ్యులు, కోరంగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోరంగి పంచాయతీ సీతారామపురం రామాలయం వీధికి చెందిన మణికంఠ, అతని స్నేహితుడు గున్నూరి అశోక్ సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై బయలుదేరి యానాం వెళుతుండగా, జార్జీపేట మలుపులో బైక్ అదుపుతప్పి ఎదురుగా ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న మణికంఠ అక్కడికక్కడే మృతి చెందగా, అశోక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన యానాం ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

సీతారామపురంలో విషాదం

అందరితో కలివిడిగా ఉండే మణికంఠ రోడ్డు ప్రమాదంలో అకస్మాత్తుగా మృత్యువాత పడడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. డిగ్రీ పూర్తి చేసి ఇటీవలే ప్రైవేటు ఉద్యోగంలో చేరిన మణికంఠ తమ కుటుంబానికి ఆసరాగా ఉంటాడని అనుకుంటే అర్ధాంతరంగా కనుమరుగైపోయాడని కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో జీవిత ఖైదు

పెద్దాపురం: మండలంలోని వడ్లమూరు గ్రామంలో 2014లో జరిగిన హత్య కేసులో షేక్ అబ్దుల్లాకి స్థానిక ఏడవ జిల్లా జడ్జి అనిత జీవిత ఖైదు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. వ్యక్తిగత కక్షల నేపథ్యంలో గ్రామానికి చెందిన షేక్ నాగూర్ సాహెబ్‌ను ఇనుపరాడ్డుతో బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పట్లో పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేశారు. వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో అబ్దుల్లాకి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పేరింశెట్టి మృత్యుంజయరావు వాదించారు.

ఫిర్కీ యాప్ ద్వారా ఉపాధ్యాయులకు శిక్షణ



ఎం.కమలకుమారి

రాయవరం: ఉపాధ్యాయుల్లో బోధనా సామర్థ్యాలను పెంపొందించేందుకు శిక్షణ కోర్సుల కోం ఫిర్కీ యాప్‌ను అందుబాటులోకి తీసుకుని వచ్చినట్లు సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎం.కమలకుమారి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు అందరూ తప్పనిసరిగా ఫిర్కీ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశించారు. అభ్యసనా ఫలితాలు, బోధన పద్ధతుల్లో నాణ్యత పెంపుదలే లక్ష్యంగా చేపట్టిన సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్(సాల్ట్) కార్యక్రమంలో భాగంగా ఈ కోర్సులు నిర్వహిస్తున్నామన్నారు. 3–10 తరగతి వరకు టీచర్ల బోధనా సామర్థ్యాలను పెంచేందుకు కోర్సులు అమలు చేస్తున్నట్లు తెలిపారు. వీటిని బ్లెండెడ్ మోడల్ విధానంలో టీచర్లకు అందజేస్తామన్నారు. ఆన్‌లైన్ శిక్షణలో వీడియోలు, రీడింగ్ మెటీరియల్, పలు రకాల టెస్టులు ఉంటాయన్నారు. ఆన్‌లైన్ కోర్సులను ఫిర్కీ యాప్‌లో చేపడతామన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరూ నవంబరు 30వ తేదీలోగా కోర్సులు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు.


ఆరోగ్యశ్రీపై అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

కాకినాడ సిటీ: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా వైద్యం పొందడంపై ప్రజలకు అవగాహన కల్పించేలా రూపొందించిన జగనన్న ఆరోగ్య సురక్ష పోస్టర్‌ను మంగళవారం రాత్రి కలెక్టర్ కృతికా శుక్లా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఆరోగ్యశ్రీ అధికారులతో కలసి ఆవిష్కరించారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వలంటీర్ ప్రతి ఇంటికీ వెళ్లి వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుని వారికి ఈ కరపత్రికలను అందజేయనున్నట్లు కలెక్టర్ వివరించారు. డీఎంహెచ్‌ఓ జె.నరసింహనాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.హేమలతా దేవి, జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయ కర్త పి.రాధాకృష్ణ, మేనేజర్ కె.నవీన్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER




■ ఆర్థిక సలహాలు, సూచనలు మరియు సహాయం ఇవ్వబడును. సిబిల్ స్కోర్ టేకోవర్, మార్టిగేజ్, పర్సనల్ సంబంధించి సంప్ర॥ 7997441253. [C-777047]

హోంకేర్ సర్వీస్

■ వృద్ధులకు సేవచేయుటకు, చిన్నపిల్లలను చూసుకొనుటకు వంట పనికోసం పనిచేయుటకు మగ/ఆడ వారు కావలెను. పర్మనెంట మంచి జీతం. ఏజెంట్లకు కమీషన్ ఇవ్వబడును. 9059835761, 8522903927. [W-1229420]

GOLD FINANCE



■ బంగారము బ్యాంకులలో, ఇతర సంస్థ లలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిర ధరకు కొనబడును.(స్పాట్‌క్యాష్).సంప్ర 88024 89999 [B-6054]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-788219]

సినిమా వార్తల కోసం లాగిన్ అవ్వండి www.sakshi.com

Wanted

■ రాజమండ్రి, కొంతమూరు, మధురపూడి, బొమ్మూర ప్రాం॥ కం॥ ATMs, షోరూమ్స్, స్టార్ హోటల్స్ నందు సెక్యూరిటీ గార్డ్స్, సెం॥ సూపర్‌వైజర్స్ కావలెను. జీ॥12to15 వేలు. రూం +ఫో. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, రాజమండ్రి. 93922 69989 [R-94]

■ పర్మినెంట్ ఉద్యోగ అవకాశం : 10th, Inter చదివిన 25 సం॥లోపు యువతీ / యువకులు కావలెను. రూం ఫ్రీ. ట్రైనింగ్ తరువాత 15,000/- to 50,000/. ఫోన్: 83742 33499, 94942 66782 [V-5923]

■ రాజమండ్రి Computer ట్రైనింగ్ సెంటర్ నందు Tally, M.S.Office, Python, Java, Web Development, Digital Marketing faculties కావలెను. జీతం: 15 వేలు ఆపైన సంప్రదించండి: 96667 72489 [P-772902]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221545]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీతం 18K, హైదరాబాద్ ఫోన్:9640258899, విజయవాడ:9640648899 [HA-590]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12,000-35,000/- ఫ్రీ రూమ్ + భోజనం. Hyd. ఫోన్ : 7993583999 [HA-608]

■ మద్రాసులో ముఖ్యంగా పెద్దవారిని చూసుకుంటూ ఇంటిపని, వంటపని చేయుటకు ఆడపనిమనిషి అర్జెంటుగా కావలెను. సంప్ర॥ 94446 79807 [R-1199331]

■ కొత్తగా స్థాపించిన మా కంపెనీ నందు పనిచేయుటకు అభ్యర్థులు కావలెను. మీ అర్హతకు తగిన విధంగా సంపాదించుకునే అవకాశం. Work from Home కూడా అందుబాటులో ఉంది. P/T-8000/-, F/T- ఆకర్షణీయమైన జీతం. 8179175150 [G-19]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221616]

■ ప్రముఖ MNC కంపెనీ (సర్పవరం హాస్పిటల్, కాకినాడ)లో పనిచేయుటకు హౌస్ కీపింగ్ స్త్రీ /పురుషులు వెంటనే కావలెను జీతం: 12వేలు. ఫోన్ : 9866355113, 7799942224 [HA-11766]

■ కాకినాడ, మెయిన్‌రోడ్, DBS బ్యాంక్, మణికంఠ కాంప్లెక్స్ 3వ ఫ్లోర్‌లో కళ్యాణవధు శారీస్ షోరూంలో పనిచేయుటకు సేల్స్‌లో 1-3 సం॥ల అనుభవం కలిగిన 25 -40 సం॥ల వయస్సు గల యువతీ యువకులు కావలెను. ✆ : 94414 63315 [R-66]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్: 0883-2483010

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

162 మద్యం సీసాలతో ఇద్దరి అరెస్ట్



పట్టుబడిన అక్రమ మద్యం, నిందితులతో కోరంగి పోలీసులు

తాళ్లరేవు: ఆటోలో మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్సై పి.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కోరంగి పంచాయతీ సుబ్బారాయుని దిమ్మ వద్ద తనిఖీలు చేస్తుండగా 162 మద్యం సీసాలను తరలిస్తున్న ఆటో పట్టుబడిందన్నారు. సామర్లకోట గ్రామానికి చెందిన శీలం అయ్యప్ప, పుట్ట యేసులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 162 మద్యం సీసాలతోపాటు వాటిని తరలించేందుకు ఉపయోగించిన ఆటోను కూడా సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాలాజీ స్వామిని దర్శించుకున్న స్వామీజీలు




అప్పనపల్లి ఆలయానికి వచ్చిన స్వామీజీల బృందం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని మంగళవారం పలువురు స్వామీజీలు దర్శించుకున్నారు. వారణాసి కాశీ విశ్వనాథ స్వామి ఆలయ స్వామి, సునీల్ చైతన్య మహరాజాజీ, విశాఖపట్నం బాల త్రిపుర సుందరి దుర్గా ఆత్మలింగ పంచప్రాణేశ్వర మహాపీఠం స్వామిజీ, బాల త్రిపురేంద్ర స్వామి శ్రీ, భూ సమేతంగా కొలువు తీరిన బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు వేద మంత్రాలతో స్వాగతం పలికారు. ఆలయ ఈఓ జి.మాధవి ఆధ్వర్యంలో ఆలయ ఉద్యోగులు వారికి ప్రసాదం, పండ్లు అందించారు.

జనసేనలో శ్రుతి మించుతున్న జగడం

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం నియోజకవర్గం జనసేన పార్టీలోకి కొత్తగా చిక్కాల దొరబాబు రాకతో అతని అనుచరులు, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ అనుచరుల మధ్య జగడం శ్రుతి మించుతోంది. సోషల్ మీడియా వేదికగా ఒకరిపై ఒకరు విమర్శనాస్త్రాలు సంధించుకుంటున్నారు. చిక్కాల దొరబాబు జనసేన పార్టీ యువకులపై పెట్టిన కేసులు ముందుగా తీసివేసి కేసులు పెట్టినందుకు క్షమాపణలు చెప్పి పార్టీలోకి రావాలని పోలిశెట్టి చంద్రశేఖర్ ప్రధాన అనుచరుడు ద్రాక్షారామకు చెందిన సంపత్ పోస్టింగ్ పెట్టారు. దానికి ప్రతిగా పార్టీ పేరు చెప్పి దోచుకుతింటున్న సంపత్.. పార్టీలోకి కొత్త వాళ్లను రానివ్వరంటూ రామచంద్రపురం పట్టణానికి చెందిన చిక్కాల అనుచరుడు జానీ పోస్టింగు పెట్టారు. దీంతో ఆ పార్టీలో హీట్ పెరిగింది. రామచంద్రపురం మండలం ఓదూరులో ఎంపీటీసీ ఎన్నికల సమయంలో జనసేన కార్యకర్త ఒకరు చనిపోతే పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఇస్తానన్న రూ. లక్ష ఆర్థిక సాయం మూడేళ్లయినా ఇప్పటి వరకు ఎందుకు రప్పించలేకపోయారని కొండేపూడి సాయికృష్ణ అనే కార్యకర్త సోషల్ మీడియా వేదికగా సంపత్‌ను ప్రశ్నించాడు. అధికారంలో లేకుండానే కుమ్ములాడుకుంటున్న జనసైనికులు ఇక ప్రజలకు ఏం మంచి చేస్తారని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.

సెక్టోరియల్ అధికారులు పర్యవేక్షణ పెంచాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కమలకుమారి

ముమ్మిడివరం: విద్యా సంబంధమైన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సెక్టోరియల్ అధికారులు పర్యవేక్షణ పెంచాలని సమగ్ర శిక్షా ఏపీసీ ఎం.కమలకుమారి సూచించారు. స్థానిక సమగ్ర శిక్షా కార్యాలయంలో మంగళవారం ఆమె సెక్టోరియల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమలకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యనిస్తుందన్నారు. ఉపాధ్యాయులు మరింత బాధ్యతాయుతంగా అంకితభావంతో కూడిన సేవలు అందించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. వీర గాథ 3.0, మార్గదర్శకాల ప్రకారం పోటీలు నిర్వహించి ఆ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే స్వచ్ఛ పక్వాడో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ బి.రమణశ్రీ, ఎఫ్ఏఓ జి.ప్రవీణ్ కుమార్, సమగ్ర శిక్షా కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ ఎం.రవికుమార్, చింతా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

KAKINADA MUNICIPAL CORPORATION

'e' PROCUREMENT NOTIFICATION

Roc No. 29352/2023/E2 Dated: 12.09-2023

Tenders invited through ap e procurement platform for 23 works with an estimated contract value of Rs.3,39,40,529/- from the eligible contractors in the following manner.

Twenty three Works for an amount of Rs.3,39,40,529/-

Last date and time for downloading bid documents: **22.09.2023 upto 02 00 PM**

Last date and time for submission of bids: **22.09.2023 upto 02 30 PM**

Tender Inviting Authority:
Commissioner, Municipal Corporation, Kakinada
Mail: Call Centre Phone:0884-2357722

Further details can be seen at 'e' procurement market place @ www.apeprocurement.gov.in

Yours faithfully,
Sd/- **CH.Naga Narasimha Rao** (FAC),
Commissioner, Municipal Corporation, Kakinada